సాక్షి యాదాద్రి భువనగిరి

శుక్రవారం, 20, జనవరి, 2023



పార్కింగ్ లేక పరేషాన్

భూదాన్‌పోచంపల్లిలో రోడ్డు విస్తరణ పూర్తయినా పార్కింగ్ సమస్య ప్రజలను వెంటాడుతూనే ఉంది.

- 9లో



బౌద్ధమే శరణ్యం

సమస్యల పరిష్కారానికి, సమాజ రుగ్మతల నివారణకు బౌద్ధమే శరణ్యమని సంఘసేన మహాథేర అన్నారు.

- 10లో

గరిష్టం/కనిష్టం 30.0°/17°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పంచ నారసింహుడికి శాస్త్రోక్త పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో గురువారం నిత్య పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం,ఆరాధన, స్వయంభూలకు నిజాభిషేకం నిర్వహించి తులసీదళాలతో అర్చించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచన పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఇక ఆలయ మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం జోడు సేవ, సహస్రనామార్చన, రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని మూసివేశారు. వివిధ పూజల ద్వారా నిత్యాదాయం రూ.19,65,432 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

వృద్ధులకు అండగా కేసీఆర్



సీనియర్ సిటిజన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

బీబీనగర్ : వృద్ధాప్యంలో ఎవరిపైనా ఆధారపడవద్దన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ ఆసరా పింఛన్లు ఇస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపారని జెడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి అన్నారు. బీబీనగర్‌లో గురువారం రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వయోధికుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వృద్ధులకు రాయితీలు, సంక్షేమ పథకాలు అందజేస్తూ వారికి అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుధాకర్ గౌడ్, జెడ్పీటీసీ ప్రణీతాపింగళిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మీశ్రీనివాస్, జిల్లా సీనియర్ సిటిజన్ ఉపాధ్యక్షులు విజయమనోహర్‌రావు, మండల అసోసియేషన్ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, బాలయ్య, లింగారెడ్డి పాల్గొన్నారు.

మొక్కల పరిశీలన



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

ఆలేరురూరల్ : మండలంలోని శారాజీపేట నర్సరీలో హరితహారం కోసం పెంచుతున్న మొక్కలను డీఎల్‌పీఓ యాదగిరి గురువారం పరిశీలించారు. జూన్ నాటికి మొక్కలను సిద్ధం చేయాలని సిబ్బందికి సూచించారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ విత్తనాలు విత్తి పెంచాలన్నారు. మొక్కలకు సమయానికి నీరందించి సంరక్షించాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీఓ జ్ఞానప్రకాష్, ఎంపీఓ సలీం, పంచాయతీ కార్యదర్శి స్వప్న ఉన్నారు.

అర్హులందరినీ ఈ-శ్రమ్‌లో నమోదు చేయండి

భువనగిరిటౌన్ : అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో అర్హులైన అసంఘటిత రంగ కార్మికులను గుర్తించి వారి వివరాలను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో అధికారులతో సమావేశం అయ్యారు. ఈ శ్రమ్ పోర్టల్‌లో అసంఘటిత కార్మికుల నమోదుపై శాఖల వారీగా సమీక్షించారు. తమ శాఖల పరిధిలో అర్హత కలిగిన కార్మికులు ఎంత మంది ఉన్నారో త్వరగా గుర్తించాలన్నారు.

పిట్టలగూడెంలో ఎలుగుబంటి సంచారం



ఎలుగుబంటి పాద ముద్రలు

రాజాపేట : మండలంలోని నెమిల గ్రామ పంచాయతీ పరిధిలోని పిట్టల గూడెంలో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు ఆనవాళ్లు కనిపించడంతో గ్రామస్తులు భయాందోళ చెందుతున్నారు. గురువారం గ్రామ శివారులో ఎలుగుబంటి సంచరిస్తుండగా కొందరు ప్రత్యక్షంగా చూశారు. పాదాల గుర్తులను గుర్తించారు.ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు తెలియజేశారు.

‘డబుల్’ కిరికిరి!

నిరుపేదలకు సాకారంకాని సొంతింటి కల

- సంక్రాంతికి పంపిణీ చేయాలనుకున్నా కుదరని ముహూర్తం
- ఇంకా కొలిక్కిరాని లబ్ధిదారుల ఎంపిక
- అడుగడుగునా రాజకీయ ఆటంకాలు
- చేతులెత్తేస్తున్న అధికారులు

సాక్షి, యాదాద్రి : సొంతింటి కోసం నిరుపేదలకు ఎదురుచూపులే మిగిలాయి. సంక్రాంతికి డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలు అమలుకు నోచుకోలేదు. మూడు దఫాలు గ్రామ సభలు నిర్వహించినా లబ్ధిదారుల ఎంపిక కొలిక్కి రాలేదు. అడుగడుగునా రాజకీయ ఆటంకాలు ఎదురవుతున్నాయన్న వాదనలున్నాయి. తమ అనుయాయులకు ప్రాధాన్యం ఇవ్వాలని అధికార పార్టీ నేతలు ఒత్తిడి తెస్తున్నారన్న విమర్శలున్నాయి.

లబ్ధిదారుల ఎంపిక కత్తిమీద సామే..

భువనగిరి, ఆలేరు, మునుగోడు, తుంగతుర్తి నియోజకవర్గాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ అధికారులకు కత్తిమీద సాములా తయారైంది. జిల్లాకు 3,620 ఇళ్లు మంజూరు కాగా 829 పూర్తయ్యాయి. మరో 574 ఇళ్లు పురోగతిలో ఉన్నాయి. పూర్తయిన ఇళ్లను సంక్రాంతికి పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. లబ్ధిదారులను ఎంపికకు గ్రామ సభలు కూడా నిర్వహించారు. అయితే లబ్ధిదారుల ఎంపికలో అధికార పార్టీ నేతల జోక్యం పెరిగింది. తమ అనుయాయులు, కుటుంబ సభ్యులకు ఇప్పించుకోవడానికి అధికారులపై ఒత్తిడి తెస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యేలపైనా సైతం ద్వితీయశ్రేణి నాయకత్వం ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు చేసేదేమీ లేక ఇప్పటికే రూపొందించిన జాబితాలను పక్కన పెట్టినట్లు



ఆలేరులో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

తెలుస్తోంది. తాజాగా కొత్త జాబితాను తయారు చేస్తున్నట్లు అధికారి ఒకరు వాపోయారు.

అధికారులతో కలెక్టర్ సమీక్ష

డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీలో జరుగుతున్న జాప్యంపై కలెక్టర్ పమేలా సత్పతి ఈనెల 17న మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లతో సమావేశం అయ్యారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 25 వరకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని ఆదేశించారు.

దరఖాస్తులు, అర్హులు ఇలా..

- ఆలేరులో 64 ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉండగా 509 మంది దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు విచారణ చేసి 145 దరఖాస్తులను అర్హత కలిగినవిగా గుర్తించారు. వాటిని ఫిల్టర్ చేసి 90మందితో జాబితా రూపొందించారు. డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది.
- భూదాన్‌పోచంపల్లిలో లబ్ధిదారుల ఎంపిక ప్రాథమిక దశలో ఉంది. గత నెల 27వరకు మీసేవ ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 659 దరఖాస్తులు వచ్చాయి.
- మోటకొండూరులో 204 దరఖాస్తులు రాగా 40 మందిని ఖరారు చేశారు. జాబితాపై ఇంకా పేచీ నడుస్తోంది.
- బీబీనగర్ మండలం కొండమడుగులో ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాపై వివాదం నడుస్తోంది. స్థానికేతరులను ఎంపిక చేశారని గ్రామ సభలో అభ్యంతరాలు తలెత్తాయి.
- సంస్థాన్‌నారాయణపురంలో 64 ఇళ్ల కోసం 220 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 96 మందిని అర్హులుగా ఎంపిక చేశారు. త్వరలో లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని అధికారులు చెబుతున్నారు.
- ఆలేరు మండలం కొలనుపాక, తుర్కపల్లి, ఆత్మకూర్(ఎం) మండలంలో లబ్ధిదారుల ఎంపిక జరిగినప్పటికీ ప్రజల్లో అనుమానాలు ఉన్నాయి. అర్హులకు ఇళ్లు ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది.

ఇళ్లు తక్కువ.. అర్హులు ఎక్కువ

డబుల్ బెడ్ రూం ఇళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా వేలాది దరఖాస్తులు వచ్చాయి. గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది. ఇళ్లు తక్కువ, అర్హులు ఎక్కువగా ఉన్న చోట డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలి. అయితే అధికార పార్టీ నేతల ఒత్తిడి కారణంగా చాలా మంది అర్హుల దరఖాస్తులను అధికారులు పరిశీలన కూడా చేయలేదు. అర్హులందరి పేర్లు డ్రాలో రాకుండా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

25 వరకు పూర్తి చేస్తాం



ఈనెల 25వ తేదీ వరకు లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేస్తాం. ఇటీవల మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వ నిబంధనల మేరకు లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తాం.

–పమేలా సత్పతి, కలెక్టర్

అంధత్వ నివారణే లక్ష్యం

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



ముల్కలపల్లిలో నిర్వహించిన కంటి వెలుగు శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

తుర్కపల్లి : అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తోందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం తుర్కపల్లి మండలం ముల్కలపల్లి గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంపూర్ణ అంధత్వ నిర్మూలనకోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కంటి వెలుగు పథకాన్ని ప్రారంభించారని, ఇది దేశంలోనే ఆదర్శవంతమైన పథకమన్నారు. ప్రతి ఒక్కరికీ కంటి పరీక్షలు చేసి ఉచితంగా అద్దాలు, మందులు అందజేయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా కంటి వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. కుటుంబ, ఆరోగ్య సంక్షేమ శాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 25 శాతం మంది కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారని, వారందరికీ వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకుముందు ఆమె కంటి పరీక్షలు చేయించుకోగా 2.5 సైట్ మెజర్‌మెంట్ వచ్చింది. దీంతో ఆమెకు వైద్యసిబ్బంది రీడింగ్ అద్దాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా సుశీలరవీందర్‌నాయక్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బీకూనాయక్, మండల ప్రత్యేకాధికారి శ్యాంసుందర్, ఎంపీడీఓ నూనె ఉమాదేవి, పీహెచ్‌సీ వైద్యాధికారి సుధీర్‌రెడ్డి, సర్పంచ్ ఇమ్మడి మల్లప్ప, కంటి వెలుగు ప్రోగ్రాం ఆఫీసర్ వినోద్, పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, టీఆర్ఎస్ తుర్కపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మహాదేవుని శ్రీనివాస్, ఎంపీటీసీ పలుగుల నవీన్‌కుమార్ సర్పంచులు పోగుల ఆంజనేయులు పాల్గొన్నారు.

తొలి రోజు 3,513 మందికి పరీక్షలు

భువనగిరి : రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రారంభమైంది. తొలి రోజు మొత్తం 34 ప్రదేశాల్లో శిబిరాలు ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 27 గ్రామ పంచాయతీలు, ఏడు మున్సిల్ వార్డులు ఉన్నాయి. తొలి రోజు 3,513 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో 978 మందికి రీడింగ్ అద్దాలు అందజేశారు. మరో 852 మందికి వివిధ పవర్ కలిగిన ప్రిస్కిప్షన్ అద్దాలు ఆర్డర్ చేశారు. వీటిని 15 రోజుల్లో వారికి అందజేస్తామని వైద్యాధికారులు తెలిపారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నేషనల్ హైవే అధికారులతో వాగ్వాదానికి దిగిన రాయగిరి రైతులు

అలైన్‌మెంట్ మార్చు చేయాల్సిందే

- రీజినల్ రింగ్ రోడ్డు బాధితుల డిమాండ్
- ఆర్డీఓ కార్యాలయంలో ప్రజాభిప్రాయ సేకరణ
- హైవే అధికారులతో రాయగిరి రైతుల వాగ్వాదం

భువనగిరి : రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంతో తీవ్రంగా నష్టపోతున్నాం.. అలైన్‌మెంట్ మార్చాల్సిందేనని భువనగిరి మండలంలోని రాయగిరి రీజనల్ రింగ్ రోడ్డు బాధితులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో నేషనల్ హైవే అధికారులు, ఆర్డీఓ భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయంలోకి వెళ్లారు. రాయగిరినుంచి వెళ్తున్న రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చడమే కాకుండా మొదటి అలైన్‌మెంట్ వివరా లు లిఖిత పూర్వకంగా తమకు ఇవ్వాలని, రింగ్ రోడ్డుకు, రింగ్ రోడ్డుకు మధ్య దూరం ఎంత ఉండాలో తెలియజేయాలన్నారు.

నేలపై బైఠాయించి నిరసన

నేషనల్ హైవే అధికారి రీజనల్ రింగ్ రోడ్డు పరిధిలో భూములు కోల్పోతున్న సర్వే నంబర్లు, రైతుల వివరాలు వివరిస్తుండగా బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాధానం అసంతృప్తిగా ఉందని కార్యాలయంలో బైఠాయించి నిరసన తెలిపారు. ఆర్డీఓ భూపాల్‌రెడ్డి జోక్యం చేసుకొని హైవే అధికారులతో చర్చించారు. మరోసారి అభిప్రాయ సేకరణ చేయడానికి సమావేశం ఏర్పా టు చేయాలని కోరడంతో అందుకు వారు అంగీకరించారు. అనంతరం బాధితులు ఆర్డీఓ, హైవే అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు, తంగళ్లపల్లి రవి కుమార్, కాయితం వెంకట్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, ఈదల శ్రీకాంత్, గోపి, పల్లెర్ల యాదగిరి, నసునూరి నాగ భూషణం, కొలను అర్జున్‌రెడ్డి, పాండు యాదవ్, అనిల్‌కుమార్, నాయినిచందర్, కూర వెంకటేష్, రామ్, చల్లగురుగుల రఘురాబు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ ఫీజులో ఫస్ట్

భువనగిరి మున్సిపాలిటీలో రూ.94.42 లక్షలు వసూలు

- రెండు నెలల్లో మరింత పెరిగే అవకాశం
- వసూళ్ల కోసం ప్రత్యేక బృందాలు
- అక్రమాలకు పాల్పడితే దుకాణాలు సీజ్

భువనగిరి : ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్లలో భువనగిరి మున్సిపాలిటీ రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంది. ఇందుకోసం అధికారులు చేపడుతున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రత్యేక ఏర్పాటు చేసిన బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఫీజు వసూలు చేస్తున్నాయి. అంతేకాకుండా అనుమతి తీసుకోకుండా దుకాణాలు నిర్వహిస్తున్న వారికి అవగాహన కల్పిస్తున్నారు. స్పందించకపోతే దుకాణాలు సీజ్ చేస్తున్నారు. ఫీజు చెల్లించని వారికి నోటీసులు జారీ చేస్తున్నారు.

ఫీజు ఈ విధంగా నిర్ణయిస్తారు

ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూలు చేసేందుకు మూడు కేటగిరీలుగా విభజిస్తారు. ఇందులో సింగ్ రోడ్డు, డబుల్ రోడ్డు, మల్టీ పర్పస్ రోడ్డుగా ఉంటాయి. వీటిలో సింగిల్ రోడ్డు మార్గంలో ఉన్న దుకాణాలకు స్క్వేర్ ఫీటుకు రూ.3, డబుల్ రోడ్డు మార్గంలో రూ.4లు, మల్టీ పర్పస్ రూట్‌లో రూ.5 చొప్పున పన్ను విధిస్తారు. ప్రాంతాన్ని బట్టి, చదరపు అడుగులను బట్టి దుకాణాలు చెల్లించే ఫీజు ఉంటుంది. ఈ ప్రకారంగా మున్సిపాలిటీలో రూ.1000 నుంచి రూ.2.80 లక్షల వరకు ఫీజు చెల్లించే దుకాణాలు ఉన్నాయి.



భువనగిరి మున్సిపాలిటీ కార్యాలయం

1,300 ట్రేడ్ లైసెన్స్‌లు

మున్సిపాలిటీ పరిధిలో 35 వార్డులు, 65 వేలకు పైగా జనాభా ఉంది. ప్రస్తుతం 1,300 మంది ట్రేడ్ లైసెన్స్‌లు కలిగి ఉన్నారు. వీరు ప్రతి సంవత్సరం మార్చి నాటికి ఫీజు చెల్లించాలి. అయితే దాదాపు ఫిబ్రవరిలోనే ఫీజు చెల్లిస్తారు. మున్సిపాలిటీలో 1,095 మంది ఫీజు చెల్లించారు. ఇప్పటి వరకు రూ.94.42 లక్షల ఫీజు వసూలైంది. ఫీజు వసూళ్లలో భువనగిరి మున్సిపాలిటీ ప్రసుత్తం రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉంది.

ప్రత్యేక దృష్టి సారిస్తే పెరగనున్న ఆదాయం

భువనగిరి పట్టణంలో ప్రధానంగా హైదరాబాద్ - వరంగల్ మార్గంలోని ఇరు పక్కలా ఎక్కువ దుకాణాలు ఉన్నాయి. వీటితో పాటు నల్లగొండ, జగదేవ్‌పూర్ మార్గాల్లో, కాలనీల్లో దుకాణాలు వెలిశాయి. కానీ, ఇందులో కొన్ని అనుమతి తీసుకోకుండా నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ లైసెన్స్ పొందే అవకాశం ఉండటంతో ఎక్కువ విస్తీర్ణం ఉన్నా కొలతలు తక్కువ చూపిస్తున్నారు. తాజాగా పట్టణంలో రిలయన్స్ స్మార్ట్ సూపర్ స్టోర్ కొలతలు తక్కువగా చూపినట్లు వెలుగులోకి రావడంతో అధికారులు సీజ్ చేశారు. అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహిస్తే అక్రమాలు నివారించడమే కాకుండా మున్సిపాలిటీకి ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది.

ప్రత్యేక టీంలు ఏర్పాటు చేశాం

ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు కోసం ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. ఫీజు వసూలుతో పాటు ఆన్‌లైన్‌లో చూపిన కొలతలకు తేడా ఉంటే వెంటనే జరిమానా విధిస్తున్నాం. అనుమతి తీసుకోకుండా దుకాణాలు నిర్వహించే వారికి నోటీసులు ఇవ్వడంతో పాటు అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్లలో భువనగిరి మున్సిపాలిటీ రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంది.

–బి.నాగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, భువనగిరి

పాదయాత్రను విజయవంతం చేయాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు



మూతికి నల్లగుడ్డ కట్టుకొని నిరసన తెలుపుతున్న నిర్వాసితులు

భువనగిరి : బీఎన్ తిమ్మాపురం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న కలెక్టరేట్ వరకు నిర్వహించనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లాకార్యదర్శి గోద శ్రీరాములు పిలుపునిచ్చారు. బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న బీఎన్ తిమ్మాపురం భూ నిర్వాసితులు చేపట్టిన దీక్షలు గురువారం 52వ రోజు కొనసాగాయి. దీక్షకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. నిర్వాసితులు 52 రోజులుగా దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. రెవెన్యూ అధికారుల అవగాహన లోపం వల్ల ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడం లేదన్నారు. బస్వాపూర్ రిజర్వాయర్ నిర్వాసితుల విషయంలో ప్రత్యేకాధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగిస్తామన్నారు. అంతకుముందు నిర్వాసితులు మూతికి నల్ల గుడ్డతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, సర్పంచ్ పిన్నం లత, ఎంపీటీసీ శారద, నాయకులు ఉడుత రాఘవులు, పుట్ట రమేష్ పాల్గొన్నారు.

వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

- హాజీపూర్ బ్రిడ్జిపై స్పందించిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..



యంత్ర సామగ్రిని పరిశీలిస్తున్న అధికారులు

బొమ్మలరామారం : మండలంలోని హాజీపూర్ వద్ద నిర్మించతలపెట్టిన బ్రిడ్జిపై అధికారులు స్పందించారు. రెండున్నర ఏళ్లుగా బ్రిడ్జి పనులు ప్రారంభించకపోవడంతో 'నిధులున్నా నిర్లక్ష్యమే' అనే శీర్షికతో ఈనెల 19న సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, కాంట్రాక్టర్ గురువారం బ్రిడ్జి ప్రతిపాదిత ప్రాంతాన్ని సందర్శించారు. బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించిన యంత్ర పరికరాలు, క్వాలిటీ కంట్రోల్ సామగ్రిని పరిశీలించారు. వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తామని ఈఈ వెల్లడించారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

- కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో అదనపు కలెక్టర్లు, హాజరైన అధికారులు

సాక్షి,యాదాద్రి : గణతంత్ర దినోత్సవానికి ఏర్పాటు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్లతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జనవరి 26న కలెక్టరేట్ ప్రాంగణంలో గణతంత్ర వేడుకలు నిర్వహించనున్నామని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి తమకు కేటాయించిన విధులను పూర్తి చేయాలని కోరారు. జిల్లా అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రసంగ పాఠం తయారు చేయాలని సూచించారు. వేదిక, పబ్లిక్ అడ్రస్ సిస్టం, జాతీయతా భావం పెంపొందించే సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లను చూసుకోవాలన్నారు. స్టాళ్ల ఏర్పాటు, మెడికల్ క్యాంప్, లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ తదితర ఏర్పాట్లను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, డి.శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ వెంకటరెడ్డి, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీఆర్‌డీఓ ఉపేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పు అమలు చేయాలి

- యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా

భువనగిరిటౌన్ : పోలీసు ఉద్యోగ నియామకాల్లో హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బర్రె నరేష్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఏనగండ్ల సుధాకర్ మాట్లాడుతూ హైకోర్టు తీర్పు మేరకు మల్టిపుల్ ప్రశ్నలకు ఏడు మార్కులు కలిపి మెయిన్స్‌కు అనుమతించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు రన్నింగ్, లాంగ్‌జంపులో ఏదేని ఒక ఈవెంట్‌లో అర్హత సాధించిన వారిని కూడా మెయిన్స్‌కు అనుమతించాలని కోరారు. నిరుద్యోగులు ఎంతోకాలంగా పోలీసు ఉద్యోగాల కోసం శ్రమిస్తున్నారని, చిన్నచిన్న పొరపాటు వల్ల వారు నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముచ్చాల మనోజ్, ఎల్లంకి పూజిత, నందరాజు, చినపత్తిని బాలస్వామి, ఉపేందర్, వెంకటేష్, సురేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులు

హైవేపై కొనసాగుతున్న రద్దీ

హైదరాబాద్ - విజయవాడ హైవేపై వాహనాల రద్దీ గురువారం కొనసాగింది. సంక్రాంతికి స్వగ్రామాలకు వెళ్లిన ప్రజానీకం తిరుగు ప్రయాణమైన నేపథ్యంలో రద్దీ నెలకొంది. మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద రద్దీ ఏర్పడకుండా హైదరాబాద్ వైపు 10 కౌంటర్లు కేటాయించారు. - చౌటుప్పల్



క్లుప్తంగా

పత్తిని ఎత్తుకెళ్లిన దొంగలు

మునుగోడు: ఓ రైతు తన వ్యవసాయ బావివద్ద దాచిన పత్తిని దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన బుధవారం రాత్రి మునుగోడులో చోటుచేసుకుంది. వివరాలు.. మునుగోడు గ్రామపంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిగూడేనికి చెందిన ఉప్పునూతల యాదయ్య తన మూడెకరాల భూమిలో పత్తి సాగు చేయగా 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మంచి రేటు వచ్చినప్పుడు అమ్ముదామని ఆ పత్తిని తన వ్యవసాయ బావి వద్ద ఉన్న ఓ గదిలో వేసి తాళం వేశాడు. ఇది గమనించిన దొంగలు బుధవారం రాత్రి ఆ గది తాళం పగులగొట్టి పత్తిని అంతా ఓ వాహనంలో వేసుకొని ఎత్తుకెళ్లారు. యాదయ్య ఉదయం వచ్చి చూసేసరికి గది తాళం పగులగొట్టి ఉండటంతో పాటు గదిలో పత్తి లేకపోవడంతో విషయాన్ని గ్రామస్తులకు తెలియజేశాడు.

ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతి


బెడద సతీష్ (ఫైల్)

మద్దిరాల (తుంగతుర్తి): ట్రాక్టర్ బోల్తాపడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని రెడ్డిగూడెం శివారులో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిగూడెం గ్రామానికి చెందిన బెడద సతీష్(43) ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగి స్తుండేవాడు. గురువారం గ్రామ శివారులో ఓ రైతు పొలం దున్నుతుండగా అకస్మాత్తుగా ట్రాక్టర్ తిరగబడడంతో సతీష్ ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో ట్రాక్టర్‌ను తొలగించి మృతదేహాన్ని బయటికి తీసి పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

కారు బోల్తా పడి..


వెంకన్న (ఫైల్)

మునుగోడు: కారు అదుపుతప్పి బోల్తా కొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన గురువారం మునుగోడు మండలంలోని సింగారం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలంలోని ఊకొండి గ్రామానికి చెందిన కట్లకుంట్ల వెంకన్న(42) ఊర్లో కిరాణ దుకాణం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మునుగోడులో సంత కావడంతో కూరగాయలతో పాటు ఇతర సరుకులు తెచ్చేందుకు తన కారులో వెళ్లాడు. సరుకులు తీసుకుని ఊకొండికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో సింగారం గ్రామం దాటిన తర్వాత మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి వరి పొలంలోకి దూసుకెళ్లింది. దీంతో కారు బోల్తా పడటంతో వెంకన్న తల పొలంలో చొచ్చుకుపోయి ఊపిరి ఆడకపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కాగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ డి. సతీష్‌రెడ్డి తెలిపారు.

'తలసేమియా'తో తీరని శోకం

- ఇద్దరు కుమార్తెలను కోల్పోయిన దంపతులు
- కుమారుడికి కూడా అదే వ్యాధి సోకడంతో తల్లడిల్లుతున్న కుటుంబం
- కూలీ పనులు చేసుకుంటున్న వారికి భారంగా మారిన వైద్య ఖర్చులు
- దాతల సాయం కోసం ఎదురుచూపు


తలసేమియా వ్యాధితో బాధపడుతున్న యశ్వంత్

కన్నీటి గాథ

మునగాల(కోదాడ): రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేద కుటుంబం వారిది. లక్షల్లో ఒకరికి వచ్చే తలసేమియా వ్యాధితో ఇప్పటికే ఇద్దరు కుమార్తెలను పోగొట్టుకున్నారు ఆ దంపతులు. కుమారుడికి కూడా అదే వ్యాధి సోకడంతో ఎలాగైనా అతడిని కాపాడుకోవాలని తాపత్రయపడుతున్నారు. వివరాలు.. సూర్యాపేట జిల్లా మునగాల మండలం తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన వింజమూరి వెంకన్న, వెంకటమ్మ దంపతులు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు శిరీష, మనీషా, లక్ష్మి, కుమారుడు యశ్వంత్ సంతానం. వీరిలో శిరీష, మనీషా, యశ్వంత్‌కు చిన్నతనంలోనే తలసేమియా వ్యాధి సోకింది. ఈ వ్యాధి బారిన పడి శిరీష తన ఏడవ ఏట, మనీషా తన పదవ ఏట మృతిచెందారు. కుమారుడు యశ్వంత్‌కు ఆరు నెలల వయస్సులోనే తలసేమియా వ్యాధి సోకగా, ప్రస్తుతం అతడికి 15 సంవత్సరాలు నిండాయి. పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులు భరించలేక ఆ దంపతులు తమ ఇద్దరు కుమార్తెలను బతికించుకోలేకపోయారు. తమ కుమారుడి ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తూ ఉండడంతో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. తమ కుమారుడి వయస్సు పిల్లలంతా పాఠశాలలకు వెళ్లి చదువుకుంటుంటే తను మాత్రం ఇంటి దగ్గరే ఉంటున్నాడని ఆ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతినెలా రక్తమార్పిడి కోసం రూ.5వేలు ఖర్చు అవుతుండడంతో ఆ దంపతుల కూలీ డబ్బులు వైద్య ఖర్చులకే సరిపోతున్నాయి. ఒకవైపు తమ కుమారుడి వైద్య ఖర్చులు భరించలేక మరోవైపు పూట గడవక ఇబ్బందులు పడుతున్నారు. దయార్ద్ర హృదయులు ఎవరైనా సాయం చేస్తే తమ కుమారుడిని మరికొంత కాలం బతికించుకుంటామన్న ఆశతో ఎదురుచూస్తున్నారు. దాతలు ముందుకు వస్తే 8499094597కు సమాచారం ఇవ్వాలని వెంకన్న, వెంకటమ్మ దంపతులు వేడుకుంటున్నారు.

వింజమూరి వెంకటమ్మ (యశ్వంత్ తల్లి)	
బ్యాంకు ఖాతా నంబర్–	73150040539
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు, మునగాల బ్రాంచ్	
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్	ఏపీజీవీ0006210
సెల్ నంబర్:	8499094597

ఈ వ్యాధి శాపంగా మారింది



మాయదారి రోగం నా ఇద్దరు కూతుర్లను నాకు దూరం చేసింది. ఇప్పుడు మృత్యువుతో పోరాడుతున్న నా కుమారుడిని చూస్తుంటే కడుపు తరుక్కుపోతుంది. రెక్కాడితేగాని డొక్కాడని మా కుటుంబానికి ఈ జబ్బు శాపంగా మారింది. పగవాడికి కూడా ఇటువంటి పరిస్థితి కలగకూడదని ఆ భగవంతుడిని వేడుకుంటున్నాను.
– వెంకటమ్మ, యశ్వంత్ తల్లి

దాతలు సాయం చేయాలి



నా సోదరి కుమారుడిని బతికించుకోవడానికి లక్షల రూపాయలు అప్పుచేసినా ప్రాణాలు దక్కే పరిస్థితి లేదు. మృత్యువుకు దగ్గరలో ఉన్న ఆమె కుమారుడు కొంతకాలమైనా బతకాలనుకుంటే దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన విధంగా ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నాను.
– ముత్యాలు, యశ్వంత్ మేనమామ

'కంటి వెలుగు'ను పకడ్బందీగా నిర్వహించాలి


మచన్‌పల్లిలో కళ్లజోళ్లు అందజేస్తున్న యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

బొమ్మలరామారం: కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బొమ్మలరామారం మండలంలోని మాచన్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ఆయన తనిఖీ చేసి రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. కంటి పరీక్షల అనంతరం పలువురికి కళ్లద్దాలు అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా పరిశీలకురాలు డాక్టర్ స్వప్న, ఇంటలిజెన్స్ ఎస్‌ఐ మహ్మద్ ఉస్మాన్ పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో మండల నోడల్ అధికారి జ్యోతికుమార్, ఎంపీడీఓ సరిత, మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్, ఆయుష్ డాక్టర్ క్రాంతి, సుమలత, కిరణ్, పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సింహ, సర్పంచ్‌లు మహేష్‌గౌడ్, వట్టిపల్లి లక్ష్మి, ఉప సర్పంచ్ భరత్, వట్టిపల్లి సుదర్శన్, వైద్య సిబ్బంది జయశ్రీ, పంచాయతీ కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, పద్మ పాల్గొన్నారు.

అంధత్వ నివారణే లక్ష్యంగా 'కంటి వెలుగు'

- భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి


భువనగిరిలోని గంజ్ ఏరియాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి : అంధత్వ నివారణే లక్ష్యంగా టీఆర్‌ఎస్ ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం నిర్వహిస్తుందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో గల శృతినగర్, 17వ వార్డులోని గంజ్ ఏరియాలో కంటి వెలుగు కార్యక్రమాన్ని డీసీపీ నారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్యపరీక్షలు చేసి కళ్లద్దాలు ఇస్తున్నట్లు తెలిపారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జడల అమరేందర్, రైతు సమన్వయ సమితి జిల్లా కో ఆర్డినేటర్ కొల్పుల అమరేందర్, మున్సిపల్ చైర్మన్ అంజనేయులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడ్ల రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కిష్టయ్య, కౌన్సిలర్ చెన్న స్వాతి మహేష్, టీఆర్‌ఎస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గాదె శ్రీనివాస్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ ఆత్మహత్య

- సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగిలో ఘటన
- మృతురాలి సొంతూరు సూర్యాపేట జిల్లా మోతె మండలం హుసేనాబాద్

పటాన్‌చెరు టౌన్: సూర్యాపేట జిల్లా మోతె మండలానికి చెందిన మహిళ మానసికస్థితి సరిగాలేక అపార్ట్‌మెంట్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్‌ఐ రామానాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతె మండలం హుసేనాబాద్ గ్రామానికి చెందిన పరశురామ్ బతుకుదెరువు నిమిత్తం వలస వెళ్లి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగిలోని కేవీఆర్ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇతడి రెండో కుమార్తె నవ్య(25)ను స్వగ్రామం హుసేనాబాద్‌కే చెందిన కిరణ్‌కు ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె సంతానం. పరశురామ్ అల్లుడు కిరణ్ కూడా ముత్తంగిలోనే పక్క అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. కాగా కొంతకాలంగా నవ్య అనారోగ్యంతో బాధపడుతోంది. మానసిక స్థితి సరిగా లేక ఆమె గతంలో రెండుసార్లు ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో గురువారం అపార్ట్‌మెంట్ 5వ అంతస్తు పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనారోగ్య సమస్యతో తన కూతురు ఆత్మహత్య చేసుకుందని తండ్రి పరశురామ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రవణ్‌రెడ్డి మృతిపై కేసు నమోదు

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండల పరిధిలోని తిప్పలమ్మగూడెం గ్రామానికి చెందిన వల్లపురెడ్డి శ్రవణ్‌రెడ్డి రెండు రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోగా గురువారం అతడి తల్లి జానకమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ మండల పరిధిలోని ఆర్లగడ్డగూడెం గ్రామానికి చెందిన బాలికతో ప్రేమ వ్యవహారంలో 2021 అక్టోబర్ నెలలో శ్రవణ్‌రెడ్డిపై కేసు నమోదయ్యింది. ఈ కేసులో అతడికి మూడు నెలలు జైలుశిక్ష పడింది. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి శ్రవణ్‌రెడ్డి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు నల్లగొండ ఆస్పత్రికి తరలించగా బుధవారం సాయంత్రం మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సత్యనారాయణ తెలిపారు.

మొరాయిస్తున్న సర్వర్

ఎన్‌ఎంఎంఎస్ యాప్ వినియోగంలో చిక్కులు

- సాంకేతిక సమస్యలతో సేవలకు అంతరాయం
- నమోదుకాని ఉపాధి కూలీల హాజరు
- రోజంతా పనిచేసినా అందని డబ్బులు


నాగారంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

మండలాలు	23
గ్రామ పంచాయతీలు	475
జాబ్‌కార్డులు	2,65,106
నమోదైన కూలీల సంఖ్య	6,16,057
పనికి వెళ్లే వారి సంఖ్య	2,91,756
ప్రస్తుతం పనికి వెళ్తున్న వారి సంఖ్య	7,000

నాగారం : జాతీయ ఉపాధిహామీ పథకంలో నూతనంగా అమలు చేస్తున్న హాజరు విధానంతో కూలీలు ఇబ్బందులు తప్పడంలేదు. నిత్యం సర్వర్ మొరాయిస్తుండటంతో కూలీల హాజరు నమోదు కావడం లేదు. రోజంతా శ్రమించి పనిచేసినా కూలి డబ్బులకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. గతంలో రాతపూర్వంగా వేసే హాజరు స్థానంలో ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) యాప్ తీసుకొచ్చారు. ఈ ఏడాది నుంచి ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

పారదర్శకత కోసమే..

ఉపాధి పనుల్లో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఎంఎంఎస్ యాప్ తీసుకొచ్చింది. పాత విధానంలో లొసుగులను ఆసరా చేసుకొని కొందరు సిబ్బంది ఇష్టాను సారంగా వివరాలు నమోదు చేసేవారు. కూలీలు రాకున్నా వచ్చినట్లు వేయడం, పనులు కాకున్నా పూర్తి చేసినట్లు చూపడం, కొలతల్లో తేడాలు వంటివి సామాజిక తనిఖీల్లో బహిర్గతమయ్యాయి. కొత్త యాప్ ద్వారా కూలీల ఫొటోలను వారు పని చేసే చోటే తీసి ఆన్‌లైన్‌లో పొందుపర్చుతున్నారు. ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో ఉదయం, సాయంత్రం కూలీల హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. ఉదయం వేళల్లో హాజరు విధానంలో అంతగా ఇబ్బందులు లేకున్నా సాయంత్రం వేళల్లో మాత్రం సర్వర్ మొరాయిస్తోంది. ఒకవేళ ఆన్‌లైన్‌లో ఒక్కపూట హాజరు వేయకున్నా ఆ రోజు డబ్బులు చెల్లించరు. అలాగే కూలీల హాజరు నమోదు ప్రస్తుతం ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు చూస్తున్నారు.

క్షేత్రస్థాయిలో ఇలా...

ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో తరచూ సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదయం హాజరు పడితే సాయంత్రం పడటం లేదు. సిగ్నల్స్ ఎప్పుడు ఉంటాయో, ఎప్పుడు పోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో ఒక వర్క్‌ఐడీ కింద పనిచేస్తున్న కూలీల సంఖ్య 20 మంది దాటితే ఆ గ్రూప్ ఫొటో యాప్‌లో నమోదు చేసేవారు. ఇప్పుడు ఒక్కో వర్క్ ఐడీ కింద ఒక్కొక్కరి చిత్రం అప్‌లోడ్ చేయాలి. అంతే కాకుండా ఒక కూలీ మొదటి హాజరును నమోదు చేసిన నాలుగు గంటల తర్వాతే రెండో హాజరు తీసుకోవాలి. లేదంటే తీసుకోదు. అలాగే ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా సుమారు 7వేల మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు. వేసవి కాలంలో మూడు నెలల పాటు నిత్యం లక్ష మందికి పైగానే ఉపాధి పనులకు వెళ్తారు. ఇంత మంది హాజరు నమోదు చేసుకోవడం ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇబ్బందే. కొందరు ఉదయం పనులకు వచ్చి సాయంత్రం రావడం లేదు. తాము డబ్బులు పోగొట్టుకుంటున్నామనే విషయం వారికి తెలియడం లేదు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో సాంకేతిక సమ్యలు తలెత్తడంతో ఉపాధి కూలీల హాజరు నమోదులో ఇబ్బంది ఎదురవుతున్నాయి. ఈ విషయంపై ఇప్పటికే జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎంవోఆర్డీ) ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. కూలీలకు రెండు పూటల హాజరు నమోదైతేనే డబ్బులు వస్తాయి. సర్వర్‌లో సాంకేతిక సమస్యను గుర్తించేందుకు ఎంవోఆర్డీ వారు పరిశీలిస్తున్నారు. త్వర్లోనే సమస్య పరిష్కారమవుతుంది.
కిరణ్‌కుమార్, డీఆర్‌డీవో, సూర్యాపేట

సవాల్‌గా మారిన హాజరు నమోదు

జిల్లాలో 475 గ్రామ పంచాయతీలు ఉండగా సుమారు 384 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేస్తున్నారు. వారికి సహాయంగా మరికొందరు మేట్లు ఉన్నారు. ప్రస్తుతం తక్కువగా కూలీలు పనులకు వస్తున్నా హాజరు నమోదు సవాల్‌గా మారింది. ఇక వచ్చే వేసవి కాలంలో ఉపాధి కూలీల సంఖ్య భారీగా పెరుగుతుంది. ఎక్కువ మంది కూలీలు ఉన్నప్పుడు ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో హాజరు నమోదు ప్రక్రియలో సర్వర్ ఇలాగే మొరాయిస్తే కూలీలకు ఇబ్బందులు తప్పవు. ప్రస్తుతం ఒక గ్రామంలో 20 పనులు పూర్తి చేసిన తర్వాతే కొత్త పనులు ప్రారంభించేలా ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. దీని వల్ల ఇప్పటికిప్పుడు ఇబ్బంది లేకున్నా వేసవి కాలంలో కూలీలకు పూర్తి స్థాయిలో పనులు కల్పించడానికి వీలు లేకుండా పోయే అవకాశం ఉంది.

దొంగను చితకబాది పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

నల్లగొండ క్రైం: నల్లగొండ మండలంలోని దీపకుంట గ్రామానికి చెందిన గూడూరు మనీలా నివాసంలో గురువారం చోరీకి యత్నించిన దొంగను గ్రామస్తులు చితకబాది పోలీసులకు అప్పగించారు. నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం మనీలా తన ఇంటికి తాళం వేసి వ్యవసాయ పనులకు వెళ్లగా.. అదే సమయంలో చండూరుకు చెందిన మధు ఇంటి తాళం పగులగొట్టి చోరీకి యత్నించాడు. శబ్దం రావడంతో ఇంటి చుట్టుపక్కల వారు గమనించి మధును పట్టుకుంటుండగా తన వద్ద ఉన్న చాకుతో బెదిరించాడు. దీంతో గామస్తులు కర్రలతో దాడి చేసి మధును పట్టుకుని నల్లగొండ రూరల్ పోలీసులకు అప్పగించారు. దొంగకు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉద్యమ ఆకాంక్షల సాధనకు పునరంకితం కావాలి


వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తెలంగాణ జనసమితి నాయకులు

భానుపురి (సూర్యాపేట): తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల కోసం పునరంకితం కావాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ధర్మార్జున్ పిలుపునిచ్చారు. తెలంగాణ మలిదశ అమరుడు కొండేటి వేణుగోపాల్‌రెడ్డి 13వ వర్ధంతి సందర్భంగా గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద వేణుగోపాల్‌రెడ్డి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను ముఖ్యమంత్రి కేసీఆర్ తన స్వార్థం కొరకు ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ అమరుల రక్తపు మరకలతో అధికారాన్ని చేజిక్కించుకున్న కేసీఆర్ ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ సభలో కనీసం అమరులకు నివాళులర్పించలేదని, జై తెలంగాణ నినాదం ఇవ్వడానికి కూడా సిగ్గుపడ్డాడని, ఇది మొత్తం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినట్లుగానే తెలంగాణ సమాజం భావిస్తుందన్నారు. కేసీఆర్ బేషరతుగా తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు మాండ్ర మల్లయ్య, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెలంగాణ అమరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిద్దారెడ్డి, తెలంగాణ జనసమితి లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ కొంచెం చంద్రకాంత్, దైద వెంకన్న, బండి రవి, తెలంగాణ జన సమితి పట్టణ అధ్యక్షుడు బంధన్ నాయక్, బొడ్డు శంకర్ గౌడ్, ఈశ్వర్ సింగ్, నక్క సాయి, బిసు స్వామి, ఖలీల్ హమీద్, దేవత్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల వేలంతో రూ. 9.35 లక్షలు ఆదాయం


వేలం నిర్వహిస్తున్న సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ అధికారి అనిత తదితరులు

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ ఎక్సైజ్ పరిధిలో వివిధ కేసులల్లో సీజ్ చేసిన వాహనాలకు గురువారం హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ అధికారి కె. అనిత ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. 21 వాహనాలకు వేలం నిర్వహించగా రూ 9.35లక్షల ఆదాయం ప్రభుత్వం ఖజానాకు సమకూరిందని తెలిపారు. సుమారు రూ.3లక్షల ఆదాయం లభిస్తుందని అంచనా వేయగా 3 రెట్లు అధికంగా ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ఏలె శ్రీనివాస్, ఎస్‌ఐలు సతీష్‌రెడ్డి, వెంకన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పుచ్చపంట సాగుతో లాభాల బాట

- యాభై ఎకరాల్లో సాగు చేస్తున్న బుడ్డారెడ్డిగూడెం రైతు
- ఎకరాకు రూ.లక్ష నికర ఆదాయం

పాడి పంట

గుర్రంపోడు: మండలంలో పుచ్చకాయ సాగు విస్తీర్ణం గత రెండేళ్లుగా రికార్డు స్థాయిలో పెరుగుతుంది. రెండు నెలల్లో ఆదాయం వచ్చే ఈ పంటను మండలంలో దాదాపు వెయ్యి ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు అంచనా. నీటి వసతి గల చోట్ల పత్తి కట్టెను తొలగించి రైతులు పుచ్చసాగుకు సిద్ధపడుతున్నారు. అంతేకాకుండా బత్తాయి తోటల్లో అంతర పంటగా పుచ్చ సాగు చేపడుతున్నారు. మల్చింగ్ షీట్‌లు, డ్రిప్ వంటి ఆధునిక పద్ధతుల ద్వారా విరివిగా పుచ్చసాగు చేస్తూ రైతులు లాభాలు గడిస్తున్నారు. మండలంలోని కొప్పోలు గ్రామ పరిధిలోనే రెండు వందల ఎకరాల్లో పుచ్చసాగు చేస్తున్నారు. బుడ్డారెడ్డిగూడెం గ్రామానికి చెందిన రైతు బొల్లం యాదయ్య భూములు కౌలుకు తీసుకుని 50 ఎకరాల్లో పుచ్చ సాగు చేస్తూ ఇతర రైతులకు మార్గదర్శకుడిగా నిలుస్తున్నాడు.


కొప్పోలులో సాగవుతున్న పుచ్చ పంట

పదేళ్ల అనుభవం

గత పదేళ్లుగా రైతు బొల్లం యాదయ్య నవంబర్ నెల నుంచి జూన్ వరకు భూములు కౌలుకు తీసుకుని పలు దఫాలుగా పుచ్చసాగు చేస్తున్నాడు. కొప్పోలు పరిధిలో చాలా గ్రామాల్లో కౌలు దొరికిన చోటల్లా పుచ్చసాగు చేస్తూ ప్రతిరోజూ పది మంది కూలీలకు వరుసగా ఆరు నెలలు ఉపాధి కల్పిస్తున్నాడు. నీటి సదుపాయం ఉన్న చోట్ల ఎకరాకు ఎనిమిది వేల వరకు భూములు కౌలుకు తీసుకుని మల్చింగ్ షీట్లు, డ్రిప్ ఏర్పాటు చేసుకుని శాస్త్రీయ పద్ధతుల్లో పుచ్చసాగు చేస్తున్నాడు. ప్రస్తుతం తేనపల్లి గ్రామంలో 10ఎకరాల్లో తాను సాగు చేసిన పుచ్చ పంట కోత దశలో ఉందని రైతు యాదయ్య తెలిపారు. ఎక్కువగా మెలికానా క్యాండీ, బాహుబలి–2 రకం పుచ్చను సాగుచేస్తున్నానని, వివిధ దశల్లో మార్చి నెలాఖరు వరకు గింజలు నాటుతానని ఆయన పేర్కొన్నారు.

రూ. లక్ష ఆదాయం వచ్చింది



ఎకరా భూమిలో పుచ్చసాగు చేస్తే రెండున్నర నెలల్లోనే రూ.లక్ష నికర ఆదాయం లభిస్తుంది. ఎకరాకు సాధారణ దిగుబడి 25 నుంచి 30 టన్నులు కాగా, తోటల వద్ద కిలోకు రూ.8 నుంచి రూ.10 చెల్లించి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. రూ.8 లెక్కన చూసుకున్నా ఎకరాకు మొదటి కోతలో 20టన్నుల దిగుబడి రాగా రూ.1.60లక్షలు ఆదాయం వచ్చింది. రెండో దిగుబడి(చిన్నసైజు కాయలు)లో కిలో రూ.4 లెక్కన పది టన్నులకు రూ.40వేలు ఆదాయం లభిస్తుంది. మొత్తం రెండు దఫాల్లో ఎకరాకు వచ్చే రూ.70వేలు పెట్టుబడి పోగా రూ.1.30లక్షలు ఆదాయం వస్తుంది. ధర, దిగుబడుల్లో తేడాలు వచ్చినా రూ.లక్ష నికర ఆదాయం లభిస్తుంది.
– బొల్లం యాదయ్య, రైతు, బుడ్డారెడ్డిగూడెం